కొలుతున్న ప్లాస్టిక్ కాగితాలను పట్టు కున్నట్టు వేళ్లు భగ్గుమన్నాయి — నరనరాల వ్యాపించిన విచిత్ర భావనేదో-




గుండెల్లో ఆవిర్లు కక్కుతోంది —

ముచ్చెమటల్లోని వేడి విచిత్రంగా శరీరాన్ని చుట్టుముడుతోంది-చచ్చుపడినట్లున్న చేతిని అతి పయత్నంమీద జేబులోనుంచి బైటకి తీశాడు డాక్టర్ దయానంద్.

వేళ్లింకా మండుతున్నాయి. బలహీనంగా వొణుకుతున్నాయి. తిరిగి జేబులోకి వెళ్ల బోయిన చెయ్యి — అప్రయత్నంగా ఆగి పోయింది —

సెగలు కక్కుతున్న వచ్చనోట్ల వేడికి భయపడికాదు. దానిని సంపాదించి పెట్టిన తన అమానుష చర్యకి తట్టుకోలేకాకాదు —

మానవత్వాన్నే మసిచేసిన మనసుకు సమాధానం చెప్పకోలేక —

వృత్తి ధర్మానికే తిలోదకాలిచ్చిన — తన ప్రవృత్తిని సమాధానపరచలేక —

నీర్సంగా కూర్చున్న డాక్టర్ దయానంద్ భారాన్ని మొయ్యటం ఇష్టంలేనట్టు-చిన్నగా శబ్దంచేస్తూ — ఇబ్బందిగా అటూ ఇటూ తిరుగుతోంది రివాల్వింగ్ ఛైర్.

ప్రతి చెమట బిందువులోనూ మండుతున్న అగ్ని కణాలను ఆర్పడం ఇష్టంలేక రివ్వున-మెత్తగా — కొత్తగా తిరుగుతోంది సీలింగ్ ఫాన్. దయానంద్ గుండెల్లో — ఎప్పడూ ఎరుగని సుడిగుండాలు సుళ్ళు తిరుగుతున్నాయి. అతని మస్తిష్కంలో — ఎన్నడూ తెలియని పెను తుఫాను విలయ తాండవం చేస్తోంది. ఎంతో ప్రయత్నంమీద —నుదుటి నుండి మెడదాకా ఖర్చీఫ్‌తో తుడుచుకుంటున్న డాక్టర్ దయానంద్, బైట నుంచి లీలగా విన్పిస్తున్న మాటలను వినాలని అతి ప్రయత్నం మీద వ్యర్థ పయత్నం చేశాడు.

అది వ్యర్థం కాకపోగా — ఎండిన తాటాకుల్ని ముట్టుకున్న చిరుమంటలా గుండెను కాల్చింది.

"ఇలా జరుగుతుందని మాకు ముందే తెల్సు. ఈ కేసు అటువంటిది మరి. ఎంత ప్రయత్నం చేస్తే మటుకు ఏంలాభం ? — ఇరవైనాలుగ్గంటల్లో ప్రాణాల్ని తీసే మాయదారి జబ్బొచ్చి పడినప్పడు.

అప్పటికీ డాక్టరుగారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఎంతో శ్రద్ధగా ఇప్పటిదాకా కృషి చేశారు...చూస్తూనే వున్నారుగా అక్కడకీ మీరు తెచ్చుకోలేరని-కావల్సిన మందులన్నీ స్వంత ఖర్చులమీదే కొన్నారు. చూశారుగా ... !"

బైట సిస్టర్ చిలకపలుకులు పలుకుతోంది.

అదురుతున్న కణతలు అరచేతి మధ్య బిగించిన డాక్టర్ దయానంద్ తల వంచుకుని మౌనంగా వుండిపోయాడు.

భయంకరమైన బొమ్మకి అందమైన రంగులు వేస్తోంది సిస్టర్ — అంతకన్నా భయంకరమైన నిజాన్ని-మృదుత్వంతో మలుస్తోంది-తన వృత్తి ధర్మాన్ని- అతి నేర్పుతో చాకచక్యంతో నిర్వర్తిస్తోంది సిస్టర్—

కానీ తను ?

ఎందుకో ఎడమకన్ను విపరీతంగా అదురుతోంది-ఎప్పడూ లేనిది — గుండె నిండుగా గుబులు బరువుగా నిండిపోతోంది — చిరుచెమటలు సన్నని మంటల్లా చుట్టుముడుతున్నాయి—

"డాక్టరుగోరు-దేముడి లాంటోరు. కన కనే-ఈవరదాకా తిండి తిప్పలు మాని-ఆడి

పేనంకోసం — కుత్తి పట్టారు ... కట్టునుకాలు తెలిసిన మారాజు కనకే — సొంత డబ్బులు మందులకోసం చిల్లపెంకుల్లా ఎదజల్లారు ... —

నరస్సమ్మా ... — ఆరినీ అనటంలా— నిన్నూ అనటంలా ... — మా పారబ్దాన్నీ...— మా కరమనీ ... అనుకుంటున్నాము ... — ఒక్కగానొక్క నలుసు నిచ్చినట్టే ఇచ్చి ... లాక్కెళ్లిపోయిన ఆ దేవుడిని అంటన్నాము ... — "

ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకుని కూడా — తనమీద సడలని వాళ్ళ నమ్మకం—

తనని కాల్చేస్తోంది—

తనని దేముడ్ని చేసిన వాళ్ల మంచితనం—

తన గుండెను పిండేస్తోంది — తప్పంతా దేముడి మీదికే నెట్టేసిన వాళ్ళ అమాయకత్వం — తనని శపిస్తోంది.

శపిస్తోంది – భగవాన్—

అంతలో హృదయవిదారకమైన ఏడుపులు— మృత్యువు నొక్కిన గుండెకోసం - గుండెలు కలవాళ్ల — గుండెలవిసే ఆర్తనాదాలు.

కాటుతిన్న మంచితనం — కాటు వేసిన మనిషిని —నిలువునా దహిస్తున్నట్టు—హాస్పిటలంతా మారుమ్రోగుతున్నాయి.

డాక్టర్ దయానంద్ బరువుగా ముందుకు నడిచాడు — తన అడుగులు భూదేవి గుండెలు నొక్కేస్తున్నట్టనిపించినా — తన కుతూహలం తననే పరిహసిస్తూ నవ్వుతున్నా— నిర్లిప్తంగా నిలబడిపోయిన డాక్టర్ దయానంద్ కళ్లకి జరుగుతున్నదంతా అస్పష్టంగా కన్పిస్తోంది.

చేతికందిన ఇరవై ఏళ్ల కొడుకుని పోగొట్టుకున్న నిర్భాగ్యుల కళ్లు—కాటిలో సగం కాలిన కొరకంచుల్లా మండుతున్నాయి.

ఎండి పిడచగట్టుకుపోయిన వాళ్ల గొంతుల్లోంచి ఆర్తనాదాలు ప్రేత సంగీతంలా అపశృతులు పలుకుతున్నాయి. గుండె నిండుగా పండించుకున్న అనురాగం నిష్ఫలంగా భళ్ళున పగిలిన కుళ్ళు గుమ్మడిలా — కొడుకు శవంమీదపడి, వాతావరణాన్ని భీభత్సం చేస్తున్నాయి.

దగ్గరకు వెళ్లబోయిన దయానంద్ ఆగిపోయాడు — కాదు ఆపేశాయి.

కల్మష మెరుగని ఆ నిరుపేదల హృదయాలు దయానంద్ అంతరాత్మపై దెబ్బకొట్టి ఆపేశాయి.

అమాయక ప్రాణాలతో — ఆటలాడుకుని జేబులు నింపుకునే డాక్టర్ల అంతరంగం తెలియని నిర్మలమైన వాళ్ల చూపులు ఆపేశాయి.

ప్రాణాలతోనే వ్యాపారం మొదలు పెట్టిన తన క్రౌర్యాన్ని ఇంకా కృతజ్ఞతతో చూసిన వాళ్ల జాలిచూపులు-ఆ చూపుల్లోని నిస్సహాయమైన వెల్లువ—చల్లగా పాదాల కంటినట్టూ మెల్లగా గుండెనుతాకినట్లై—ఆగిపోయాడు.

కొన్ని గంటల క్రిందట-వాళ్ల కళ్లలో మెరిసిన జీవనజ్యోతి— ఇప్పుడు కొడిగట్టి అంధకారాన్ని పులుముతోంది.

కొంతకాలం క్రితం—వెలుగు నిండిన వాళ్ల గమ్యం ఇప్పుడు అగమ్యమై— అంధకారమయమైంది—వాళ్లకున్న ఒకే ఒక్క ఆధారం ముక్కలు ముక్కలైంది— కారణం వాళ్లు ఊహించలేరు.

వాళ్ల నిర్మలత్వం నిజాన్ని ఆలోచించనివ్వదు.

ఐనా — నిప్పులాంటి నిజం — తనగుండెని కాల్చక వొదుల్తుందా ?

వాళ్ల కడుపుశోకం—తన...!ముచ్చెమటలు పోశాయి డాక్టర్ దయానంద్‌కి— జేబులో వున్న పచ్చ కాగితాలు—గుండెను క్రిందకి లాగుతున్నాయి.

ప్రేగుల్ని మెలి పెడుతున్నాయి అంతలో.

నల్లటి టాక్సీ-పెద్ద శబ్దం చేస్తూ— గుమ్మంలో ఆగింది- హడావుడి పడిపోతున్న ఐదారుగురు స్టూడెంట్సు—ఒక శరీరాన్ని టాక్సీలోంచి కిందికి దింపుతున్నారు—

వాళ్ల మొహాల్లో కళలేదు— వాళ్ళ చేతుల నిండా ఆదుర్దా— ఆ చేతుల్లో మెలికలు తిరుగుతున్న...'




సార్ ! ఇది — నేను రికమండేషన్లను నిరసిస్తూ రాసిన ఘాటైన వ్యాసం ! దీన్ని మీ వీక్లీలో ప్రచురించమని మీ తమ్ముడు గారు రాసిన సిఫారసు ఉత్తరం దీనితో జతపర్చాను !!

బలమైన మంచుకొండ, బలంగా మొహానికి తగిలి నట్లైంది దయానిధికి—

అగ్నిపర్వతం శగలు కక్కుతూ గుండెల్లో ఒక్కసారిగా పగిలింది—

పదునైన కసాయి కత్తి—ఒక్కవేటున— ప్రేగుల్ని నరికింది.

"బాబూ—!"

ఆర్తనాదం గుండె మంటల్లో చిక్కుకుపోయింది— కర్తవ్యం ప్రేగు ముక్కల్లో నొక్కులు పడుతోంది—

అంతలో "అందరం పిక్నిక్‌కి సరదాగానే వెళ్లాము—వెళ్లిన కాసేపటిదాకా బాగానే వున్నాడు. తరువాత వంట్లో బాగా లేదని దేంట్లోనూ పార్టిసిపేట్ చెయ్యకుండా పడుకున్నాడు... మాకేం తెలుసు...మామూలు సుస్తీ అనుకుని నెగ్లెక్ట్ చేశాం... ప్రొద్దున్నే లేచేసరికి—కడుపునొప్పితో ఉంగలు చుట్టుకుపోతున్నాడు...ఎప్పట్నుంచి అలా బాధ పడుతున్నాడో...మాతో మాటమాత్రం చెప్పలేదు—"

డాక్టర్ దయానంద్ చెవుల్లో—హోరులో అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

కన్నీటి పొరలను చీల్చుకుని అతి ప్రయత్నం మీద చూశాడు—

టేబిల్‌మీద-తన రవి-తన ప్రాణం—తనకున్న ఒకే ఒక్క బంధం— తన గుండెల్లో వెలిగే-ఒక్కగానొక్క దీపం-తన కడుపులో కదిలే ఒకే ఒక్క ప్రేగు—

—నరకయాతన పడుతున్నాడు.

—మరణబాధ పడుతున్నాడు.

" నానీ —! "

అరుపు ఆర్తనాదంలా వచ్చింది-

కేసు అర్థమైంది ... —

కర్తవ్యం వెల్లువలా ముందుకు నెడుతోంది—

అప్రయత్నంగా తన చేతులు చూసుకుంటూనే ఆగిపోయాడు-అందులో తను తీసిన అమాయక ప్రాణం—

— ప్రతిఫలంగా తను తీసుకున్న పచ్చనోట్లు—

నిర్దాక్షిణ్యంగా—తన చేతులు పులుముకున్న పసినెత్తురు — తద్వారా శాశ్వతంగా తనతో పాలు పంచుకోబోయే-పాపం—దాని తాలూకు శాపం—

' భగవాన్ !!! '

మంచు ముక్కలమధ్య తడిసిన శవంలా నీరు కారిపోయాడు డాక్టర్ దయానంద్ —

## తనదాకా వస్తే గాని..

"సిస్టర్ – !"

గొంతు చించుకున్న ఆ అరుపులో స్మశానంలోని గ్రద్దలు నవ్వాయి-కంగారు పడుతున్న సిస్టర్ – ఒక్క పరుగున డాక్టర్ దగ్గర కొచ్చింది–

ఫ్లూ వచ్చినట్టు వణికిపోతున్న డాక్టర్ వంక జాలిగా చూసింది.

"సిస్టర్...డాక్టర్ ప్రసాద్‌ని... పిలు... అర్జంట్...ఇంటస్టైనల్ అబ్‌స్ట్రక్షన్–బాబుకి– ఆపరేషన్–అర్జంట్–"

ఏదోలోకంలో వున్నట్టు, అసంపూర్తిగా మాట్లాడుతున్నా విషయం అర్థమైంది సిస్టర్‌కి–

"బాప్‌రే-!"

ఒక్క గంతులో ఫోన్ దగ్గరకు వెళ్లిన సిస్టర్ చేతులు చురుగ్గా పనిచేస్తున్నాయి–

"సార్ ! డాక్టర్ ప్రసాద్ అవుటాఫ్ స్టేషన్‌ట–"

డాక్టర్ దయానంద్ కళ్ళ ముందు పిడుగులు పడ్డాయి.

"సిస్టర్...ప్లీజ్‌కాల్...డాక్టర్ శంకర్!" దయానంద్ గొంతు పీలగా వొణుకుతోంది–

"........"

"——"

"సార్...డాక్టర్ శంకర్... ఎమర్జెన్సీ ఆపరేషన్‌లో వున్నారుట–"

"........"

"డాక్టర్ రమాదేవి–ఇప్పుడే-సిజేరియన్ ప్రారంభం చేశారుట... !"

"మై గాడ్– !"

డాక్టర్ దయానంద్ పిడికెళ్లు భయంతో బిగుసుకున్నాయి. దవడలు బలంగా బిగుసుకు పోయాయి.

గుండెలో రక్తం గడ్డ కట్టుకుంటోంది–

"సారీ...ఆపరేషన్‌కి–తండ్రిగా మీరు అటెండవటం కష్టమే ... ఐనా గుండె రాయి చేసుకోండి... బాబు కండిషన్ ఏమీ బాగా లేదు... మరో డాక్టర్ కోసం చూస్తూ కూర్చుంటే అసలుబాబే దక్కకపోవచ్చు...సార్ సార్–! "

డాక్టర్ దయానంద్ సిస్టర్ మాటలు వింటూనే అయోమయంగా బాబుని చూశాడు. పరిస్థితి చెయ్యిదాటిపోయే ప్రమాదం కన్పించింది–ఏమాత్రం–ఉపేక్షకీ– ఆస్కారంలేదు. వెంటనే సర్జరీ చెయ్యాలి–సర్జరీ–

డాక్టర్ దయానంద్ నరాలు. అంగుళం అంగుళం పుటుక్కున తెగుతున్నట్టుగావుంది.

రక్తం గడ్డకట్టి–నీటిని చిమ్ముతున్నట్టుంది. తన 'నానీకి' తను ఆపరేషన్ చేయాలి.... కనీసం ఇంజక్షన్ కూడా తన బిడ్డకు స్వయంగా ఇవ్వలేని తను ప్రాణాలకు తెగించి– ప్రాణం నిలబెట్టుకోటం కోసం– ప్రాణాంతకమైన మేజర్ ఆపరేషన్ చెయ్యాలి –తన చేతులతో– తన బిడ్డ పొట్టను నిర్దాక్షిణ్యంగా కొయ్యాలి. వాడి చిన్నారి ప్రేగుల్ని–..."

మరొక ప్రేగు మంట బైటనుంచి సూటిగా గుండలకు తాకింది.

'బాబూ–రావుడూ–మమ్మల్నెంజేసి పోయావురా బిడ్డా– మీ అయ్య నాదిలి–ఇక నుంచీ...వొంటరిగా ఏడ తొంగుంటావురా... అయ్యా..., నువ్వునేక మీయమ్మ కూడెట్టా తింటుందిరా రాజా – !"

డాక్టర్ దయానంద్ చేతులు చల్లబడుతున్నాయి. గుండె మంచుముద్దతో కప్పినట్టుంది–

తన ప్రమేయం లేకుండానే ఎమర్జన్సీ ఆపరేషన్‌కి కావల్సిన తతంగమంతా చెకచెకా జరిగిపోతోంది.

తన బాబుదగ్గరకు వెళ్లటానికి–తనకాళ్లే సాహసించటంలేదు.

తన నానీని నిమరటానికి – తన పాపిష్టి చేతులే ముందుకు సాగటంలేదు.

తన బాబుకోసం–కన్పించని భగవంతుడ్ని ప్రార్థిద్దామన్నా – కలుషపూరితమైన తన మనసుకు ధైర్యం చాలటంలేదు.

స్నేహితులే బాబుని థియేటర్లో దింపి వచ్చారు – వాళ్ల మంచి మనసులైనా తన బాబుని రక్షించకూడదా ? – రక్షించవా ??

యాంటిసెప్టిక్ లోషన్‌తో చేతులు కడిగినా – బ్రష్‌తో రుద్దినా – మరిగే నీటిని పోసినా... అవి శుభ్రపడటంలేదు... పవిత్ర




మవటంలేదు...

అదేపనిగా చేతులు రుద్దుకుంటున్న డాక్టర్‌వంక తెల్లబోయి చూస్తున్నాడు — వాటర్ పొయ్యటానికి నిలబడ్డ థియేటర్ బోయ్.

'త్వరగా వెడితే-తన బాబు పొట్టను చీల్చాలి ... తనాపని చెయ్యలేడు... కానీ చెయ్యాలి... తప్పదు ... ఆలశ్యం అవుతే బావుండును ఆపరేషన్ మొదలుపెట్టటానికి కానీ — క్షణంకూడా ఆలశ్యం అవటానికి వీల్లేదు...

ఎలా? తన చేతులు...శుభ్రపడటంలేదే...

శాపగ్రస్తమైన ఈ చేతులతో చేసే ఆపరేషన్ విజయవంతమౌతుందా ?

ఏ పాపమూ ఎరుగని తన బాబుకి తన పాపం అంటకుండా వుంటుందా ?

అంటుతుందా ???

'అంటితే ? ఎలా ? ఎలా ?'

చలన రహితంగా నిలబడ్డ డాక్టర్ దయానంద్ ఎప్రన్‌కు తాళ్లు బిగిస్తున్న థియేటర్ అసిస్టెంట్..., మతిపోయినట్లున్న డాక్టర్‌ని మతిపోగొట్టుకుని చూస్తున్నాడు.

అన్నీ రెడీ చేసుకున్న సిస్టర్ కళ్లప్పగించి చూస్తోంది. నిజానికి ఎంతో కంగారుగా నిముషాలమీద జరగవలసిన ఆపరేషన్ ఇది.

అతి ప్రయత్నం మీద పెద్ద కొండలా కదిలిన డాక్టర్ దయానంద్.

స్కాల్పెల్ పట్టుకుని — బాబు మొహం లోకి ఒక్కసారి చూశాడు.

మూర్తీభవించిన పవిత్రత మెరుపులా కొట్టింది. తనూహించని తేజస్సేదో — కళ్ళలో సూదులు గుచ్చాయి. స్కాల్పెల్ పట్టిన చెయ్యి కొలిమిని కట్టిన దర్భలా కాలుతోంది.

ఆపరేషన్ చెయ్యవలసిన ఫీల్డ్‌లో రాముడి లేతపొట్ట ప్రాంతం ఎగిరెగిరి పడుతున్నట్టు మెరుస్తోంది.

రక్తనాళాలు వెచ్చటి ఆవిరితో ఉబ్బాయి- మెదడులోని రక్తంవెల్లువలా బైటకి ప్రవహిస్తున్నట్టుంటే, పంచరంగులూ కళ్లల్లో తిరిగాయి — వాటిలో —

జబ్బనేదే లేని రాముడి ఆరోగ్యవంతమైన శరీరం — చిన్న బిళ్ళతో పోయే సామాన్యమైన కడుపునెప్పి—రాముడి తల్లిదండ్రుల అమాయకత్వంతో కూడిన తీర్చలేని ఆవేదన.

దాన్ని ఆసరాగా తీసుకుని మూడు పచ్చ నోట్లకోసం తన ఆరాటం. అది కల్పించిన అవసరం — తన అవసరానికి, అవసరంగా — రాముడికి ఎమర్జెన్సీ ఆపరేషనే...

అందులో స్పైనల్ షాక్...

ఎమర్జెన్సీ డ్రగ్స్‌కోసం... వాటిని కొనలేని — వాడి తల్లితండ్రుల అసమర్ధతని దృష్టిలో వుంచుకుని, చేతులారా వాడి ప్రాణం కోసం — పచ్చనోటును మార్పించలేక ... అనవసరంగా వాడి ఆయువును పరీక్షించిన తన కాలయాపన...

ఫలితంగా... ఇది హత్య అని బయటకు తెలియని... తెలియలేని — కోల్డ్ బ్లడెడ్ మర్డర్ — దానివల్ల అమాయకులకు తీరని గర్భశోకం...

గర్భశోకం... గర్భశోకం...

"సార్ — !"

సిస్టర్ పెట్టిన చావుకేకకి — ఇన్‌సిషన్ ఇవ్వబోతున్న డాక్టర్ దయానంద్ చేతులు పట్టుతప్పాయి.

నెత్తిమీద మంచు పర్వతం బ్రద్దలైంది— సిస్టర్ కేకకి అర్ధం ???

అర్ధమైంది.

'తన పాపిష్టి చేతులతో ఆపరేషన్ చేయించుకునేటంతటి అపవిత్రుడుకాడు తన బాబు...'

తన రక్తాన్ని పంచుకున్న పాపానికి — తన పాపాన్ని పంచుకోటానికి సిద్ధంగాలేదు తన బాబు...

'ఇక లేదు తన బాబు...'

నిల్చున్న పళంగా కూలిపోతున్న డాక్టర్ దయానంద్‌ని పట్టుకోవటం, అసాధ్యమై పోయింది.


VOLTAS

ఇప్పుడు వోల్టాస్ ఓపల్ 160-లీటర్

ఎంతో భావపూరితమైన ఫ్రిజ్

4 అద్వితీయమైన లక్షణములు



- అత్యంత పెద్ద షెల్ఫ్ స్థలం.
- అతిలోతైన చల్లని ట్రే 6 చల్లని పానీయ సీసాలను ఉంచుటకు సరిపోయే స్థలంగలది.
- పొదుపైనది 24% విద్యుచ్ఛక్తి ఆదా అవుతుంది.
- 19% అత్యంత వేగంగా ఐస్ ఏర్పడుతుంది

వోల్టాస్ నుంచి-చల్లబరచుటలో నం.1

అనుమతిపొందిన వోల్టాస్ డీలర్ వద్ద లభించుచున్నది

మెస్సర్స్ : శ్రీ భాస్కర ఆటో ఏజన్సీస్,

సుభాష్ రోడ్డు, కాకినాడ- 533001.

Phone No. 4112.